

ప్రత్యామ్నాయం 1271

జీపీటీ 5204 రకానికి ప్రత్యామ్నాయంగా ఎంటీయూ 1271 వరి వంగడాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలన చేయాలని పరిశోధనా సంచాలకులు ఆదేశించారు. 8లో ▸



నగదు స్వాధీనం

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో వాహనాల తనిఖీల్లో భాగంగా శనివారం వేర్వేరు వ్యక్తుల నుంచి రూ.2.53 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు. 8లో ▸



తేనెటీగల దాడి

విస్సాకోడేరు పంచాయతీ వంకాయల పాలెంలో ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలపై తేనెటీగలు దాడి చేయడంతో 11 మందికి గాయాలయ్యాయి. 8లో ▸

ఎన్నికల నిఘా ముమ్మరం

- పటిష్టంగా తనిఖీలు
- జిల్లాలో 8 సరిహద్దు చెక్‌పోస్టులు
- రూ.1.87 కోట్ల నగదు స్వాధీనం
- 16.528 కిలో బంగారం, 31 కిలోల వెండి సీజ్
- 49,619 లీటర్ల మద్యం స్వాధీనం





ఏలూరు కలపర్రు టోల్‌ప్లాజా వద్ద వాహన తనిఖీలను పరిశీలిస్తున్న జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతి, వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

ఏలూరు టౌన్: సార్వత్రిక ఎన్నికల హీట్ పెరిగింది. ఏలూరు జిల్లావ్యాప్తంగా పటిష్ట భద్రతా చర్యలతో పాటు నిత్యం తనిఖీలతో ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా జిల్లా అధికార యంత్రాంగం పక్కా ప్రణాళికతో ముందుకు వెళుతుంది. కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ నేతృత్వంలో జిల్లా ఎస్పీ డి.మేరీ ప్రశాంతి పర్యవేక్షణలో పోలీస్ అధికారులు పటిష్ట చర్యలు చేపడుతున్నారు. ఎన్నికల షెడ్యూల్ ప్రారంభం నుంచి ఇప్పటివరకు జిల్లా, రాష్ట్ర సరిహద్దుల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేయటం, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు వాహన తనిఖీలతో అక్రమ రవాణాకు చెక్ పెడుతున్నారు.

భారీగా నగదు.. బంగారం

ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన మార్చి 16 నుంచి ఈనెల 20 వరకు జిల్లాలో భారీ ఎత్తున నగదు, మద్యం, బంగారు, వెండి స్వాధీనం చేసు కున్నారు. సుమారు రూ.1,87,17,300 నగదు పోలీసు తనిఖీల్లో పట్టుబడగా 109 కేసులు నమోదు చేశారు. 16.528 కిలోల బంగారం, 31 కిలోల వెండిని స్వాధీనం చేసుకున్నారు. విలువ సుమారు రూ.10,17,10,156గా ఉంది. ఇంత భారీ ఎత్తున జిల్లాలో బంగారం, వెండి స్వాధీనం చేసుకోవటం విశేషం. అలాగే మద్యం, నాటుసారా, ఇతర మద్యం అక్రమ రవాణా చేస్తుండగా తనిఖీలు చేస్తూ 49,619.08 లీటర్లను సీజ్ చేశారు. దీని విలువ సుమారుగా రూ.1,27,36,210గా ఉంది. ఓటర్లను ప్రలోభ పెట్టే బహుమతులను తనిఖీల్లో సీజ్ చేశారు. సుమారు రూ.33 వేల విలువైన చీరలు, ఇతర వస్తువులు ఉన్నాయి.

సరిహద్దుల్లో కట్టుదిట్టంగా..

జిల్లాకు తెలంగాణ సరిహద్దు ఉండటంతో అంతర్రాష్ట్ర, అంతర్ జిల్లాల చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. జిల్లాలో ప్రధానంగా 8 సరిహద్దు చెక్‌పోస్టులు ఉన్నాయి. వీటితో పాటు నిరంతరం తనిఖీలు చేసేలా 46 ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలను నియమించి పర్యవేక్షిస్తున్నారు. జిల్లాలో అక్రమ రవాణాను నిరోధిస్తూ పోలీస్ యంత్రాంగం శ్రమిస్తోంది. రాష్ట్ర, జాతీయ రహదారుల్లోనూ, ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో వాహన తనిఖీలు చేస్తూ మద్యం, నగదు అక్రమ రవాణాతోపాటు, గంజాయి, నాటుసారా, ఇతర రాష్ట్రాల మద్యం జిల్లాలోకి ప్రవేశించకుండా పటిష్ట నిఘా పెట్టారు.

స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకునేలా..

జిల్లాలో మే 13న జరిగే సార్వత్రిక ఎన్నికలను ప్రశాంతమైన వాతావరణంలో నిర్వహిస్తూ... ఓటర్లు తమ ఓటు హక్కును భయం లేకుండా స్వేచ్ఛగా వినియోగించుకునేలా చర్యలు చేపట్టాం. ప్రతి నియోజకవర్గంలో ప్రత్యేక నిఘా బృందాలు, సాయుధ బలగాలను మోహరించటంతోపాటు ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. గ్రామాల్లో ప్రజలకు ఓటు హక్కుపై అవగాహన కల్పించేలా చర్యలు తీసుకున్నాం. ముఖ్యంగా సోషల్ మీడియాలో విద్వేషాలు రెచ్చగొట్టేలా పోస్టులు పెట్టడం, మతం, కులాల మధ్య చిచ్చుపెట్టే అంశాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నాం. రాజకీయ పార్టీలు ఏదైనా కార్యక్రమాన్ని నిర్వహించుకునే ముందు ఎన్నికల అధికారుల నుంచి అనుమతులు తీసుకోవాలి. ఇలా ప్రతి అంశాన్నీ నిశితంగా గమనిస్తూ ఎన్నికలు సమర్థవంతంగా పూర్తి చేసేందుకు పోలీస్ వ్యవస్థ పనిచేస్తోంది.

– దాసరి మేరీ ప్రశాంతి, ఏలూరు జిల్లా ఎస్పీ

అట్టహాసంగా విజయరాజు నామినేషన్



నామినేషన్ దాఖలు చేస్తున్న వైఎస్సార్‌సీపీ అభ్యర్థి కంభం విజయరాజు. చిత్రంలో ఎంపీ కోటగిరి శ్రీధర్‌బాబు, ఎంపీ అభ్యర్థి సునీల్‌కుమార్

చింతలపూడి: చింతలపూడిలో శనివారం వైఎస్సార్ సీపీ అభ్యర్థి కంభం విజయరాజు నామినేషన్ దాఖలు చేశారు. నాలుగు మండలాల పార్టీ శ్రేణులు భారీ ర్యాలీగా ఆయన తరలివచ్చారు. లింగపాలెం మండలం వలసపల్లి అడ్డరోడ్డు నుంచి కార్లు, బైక్‌లతో అట్టహాసంగా ర్యాలీ నిర్వహించారు. ముందుగా వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి ర్యాలీ ప్రారంభించారు. పాత బస్టాండ్ సెంటర్ వద్ద అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉదయం 10.53 నిమిషాలకు ఎన్నికల రిటర్నింగ్ అధికారి కె.అద్దయ్యకు నామినేషన్ పత్రాలను అందజేశారు. ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్‌బాబు, ఏలూరు ఎంపీ అభ్యర్థి కె.సునీల్‌కుమార్ యాదవ్, నాయకులు గోరుముచ్చు గోపాల్ యాదవ్, బీవీఎస్ రెడ్డి, ఏఎంసీ చైర్‌పర్సన్ జగ్గవరపు జానకిరెడ్డి, చింతలపూడి జెడ్పీటీసీ ఎం.నీరజా, ఎంపీపీ రాంబాబు నాయక్, జంగారెడ్డిగూడెం జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జి, మాజీ ఏఎంసీ చైర్మన్‌లు మండలపు సాయిబాబు, మేడవరపు అశోక్‌బాబు, బొడ్డు వెంకటేశ్వరరావు, సీహెచ్ జ్ఞానారెడ్డి, గంధం చంటి, కన్వీనర్ కొప్పుల నాగేశ్వరరావు ఉన్నారు.

న్యూస్‌రీల్

ఓటు హక్కును వినియోగించుకోవాలి



వె.ప్రసన్నవెంకటేష్, కలెక్టర్

ఏలూరు(మెట్రో): జిల్లాలో మే 13న జరిగే సార్వత్రిక ఎన్నికల పోలింగ్ రోజు ఓటర్లంతా ఓటు హక్కు వినియోగించుకోవాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి వె.ప్రసన్న వెంకటేష్ తెలిపారు. ఈ మేరకు ఏర్పాట్లు చేశామన్నారు. 85 ఏళ్ల నిండిన సీనియర్ ఓటర్లు, దివ్యాంగులు, సర్వీసు ఓటర్లు, ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బంది, పోలీస్ సిబ్బంది, డ్రైవర్లు, కండక్టర్లు, క్లీనర్లు, అత్యవసర సేవలందించే వారికి హోం ఓటింగ్, పోస్టల్ బ్యాలెట్, ఈటీపీబీఎస్ (సర్వీసు ఓటర్లు) వంటి ప్రత్యేక ఏర్పాట్లు చేశామన్నారు. పోలింగు రోజు విధుల్లో ఉన్న అత్యవసర సర్వీసులో పనిచేసే 33 శాఖలకు చెందిన ఉద్యోగులు, సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ సౌకర్యం కల్పించారన్నారు. వీరంతా ఫారం–12డీని రిటర్నింగ్ అధికారికి అందజేసి పోస్టల్ బ్యాలెట్ ఓటును వినియోగించుకోవచ్చ న్నారు. అలాగే ఆర్మీ, మిలట్రీ సర్వీసుల్లో పనిచేసే సర్వీసు ఓటర్లు ఈటీపీబీఎస్ ద్వారా పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం పొందచవ్చన్నారు. ఆన్‌లైన్ ద్వారా వారికి బ్యాలెట్ పంపి పోస్టల్ సర్వీసు ద్వారా స్వీకరిస్తామని కలెక్టర్ తెలిపారు.

అందుబాటులో గోనె సంచులు



ధాన్యాన్ని పరిశీలిస్తున్న వ్యవసాయ శాఖ జేడీ

దెందులూరు: జిల్లాలోని అన్ని రైతు భరోసా కేంద్రాల్లో గోనె సంచులు అందుబాటులో ఉంచాలని వ్యవసాయ శాఖ జిల్లా జాయింట్ డైరెక్టర్ హబీబ్ బాషా అన్నారు. శనివారం దెందులూరు రైతు భరోసా కేంద్రాన్ని, రోడ్లపై ధాన్యం రాశులను ఆయన పరిశీలించారు. రైతులతో మాట్లాడారు. రైతు భరోసా కేంద్రంలో తేమ శాతం, ధాన్యం కొనుగోలు వివరాలు తెలుసుకున్నారు. రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని, గోనె సంచులు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉంచాలన్నారు. అసిస్టెంట్ డైరెక్టర్ సుబ్బారావు, వ్యవసాయ అధికారి గద్దె రమేష్ ఉన్నారు.

24 నామినేషన్ల దాఖలు

ఏలూరు(మెట్రో): జిల్లాలో నామినేషన్ల ప్రక్రియ ప్రారంభించనప్పటి నుంచి ఇప్పటివరకు 24 నామినేషన్లు దాఖలు అయ్యాయని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి వె.ప్రసన్న వెంకటేష్ తెలిపారు. శనివారం ఏలూరు పార్లమెంటరీ నియోజకవర్గానికి సంబంధించి నామినేషన్లు దాఖలు కాలేదని, ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు 9 నామినేషన్లు దాఖలు అయ్యాయన్నారు. ఎన్నికల నేపథ్యంలో ఈఎస్ఎంఎస్ కింద చేపట్టిన సీజర్ మేనేజ్‌మెంట్ ప్రక్రియ ద్వారా ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటివరకూ జిల్లాలో రూ.13.45 కోట్ల విలువైన నగదు, బంగారం, మద్యం, ఇతర వస్తువులు సీజ్ చేశామని కలెక్టర్ తెలిపారు.

22న టెన్త్ ఫలితాల విడుదల

ఏలూరు (ఆర్ఆర్‌పేట): 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి 10వ తరగతి పరీక్షల ఫలితాలు ఈనెల 22న విడుదల చేయనున్నట్టు రాష్ట్ర ప్రభుత్వ పరీక్షల కమిషనర్ డి.దేవానంద రెడ్డి శనివారం తెలిపారు. ఏలూరు జిల్లాలో 32,355 మంది విద్యార్థులు పరీక్షలు రాసి ఫలితాల కోసం ఎదురుచూస్తున్నారు. ఫలితాల్లో జిల్లా స్థానం మెరుగుపడే అవకాశం ఉందని విద్యాశాఖ అధికారులు అంటున్నారు.

ఖర్చుపై అవగాహన తప్పనిసరి

పెనుగొండ: ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల ఖర్చులపై పూర్తిస్థాయి అవగాహన కలిగి ఉండాలని అసెంబ్లీ ఎన్నికల వ్యయ పరిశీలకుడు మోహల్ అగర్వాల్ అన్నారు. శనివారం ఆచంట రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో జరిగిన సమావేశంలో అధికారులకు ఆయన సూచనలు చేశారు. అవగాహనతో పాటు ఖర్చుల రిజిస్టర్ నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ఎన్నికల కమిషన్ నియమాలను అనుసరించి కార్యాచరణ రూపొందించాలన్నారు. సమస్యాత్మక, సున్నిత ప్రాంతాలపై ప్రత్యేక నిఘా పెట్టాలన్నారు. ఖర్చుల పరిశీలనపై అత్యంత జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నామినేషన్ల సందర్భంగా ఆయా పార్టీలు నిర్వహించిన ర్యాలీల వీడియోలను పరిశీలించారు.

సూక్ష్మస్థాయిలో నిఘా

నియోజకవర్గ స్థాయి ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు ఎన్నికల ప్రచారాలపై సూక్ష్మస్థాయిలో నిఘా పెట్టాలని ఆచంట నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, పర్యాటక శాఖ రీజనల్ డైరెక్టర్ వి.స్వామినాయుడు అన్నారు. రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో నిఘాలో ఉన్న 11 వీడియో బృందాలు, నాలుగు ఫ్లయింగ్ స్క్వాడ్‌లతో ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. నామినేషన్ వేసిన రెండు ప్రధాన పార్టీలు చేసిన ర్యాలీల సమాచారాన్ని ఇవ్వాలని ఆదేశించారు.

అభివృద్ధిని చూసి ఓటేయండి

ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి



జయపురంలో ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి

పెదపాడు: ప్రతి ఇంటా సంక్షేమ పథకాలు అందించడంతో పాటు గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. మండలంలోని కొత్తూరు, తాళ్లగూడెం, జయపురం, కొత్తముప్పర్రు, పాతముప్పర్రు, వీరమ్మకుంట గ్రామాల్లో శనివారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న రోజుల్లో కొత్త పింఛన్లు మంజూరు చేస్తామని, రోడ్లు అభివృద్ధి చేస్తామని చెప్పారు. వలంటీర్లకు మంచి భవిష్యత్ ఉంటుందన్నారు. జగనన్న పాలనలో గ్రామాల రూపురేఖలు పూర్తిగా మారాయని, గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు, సీసీ రోడ్ల, సీసీ డ్రెయిన్ల నిర్మాణం వంటివి చేపట్టామన్నారు. దెందులూరు ప్రజలు తనపై చూపిన అభిమానానికి రుణపడి ఉంటామని, వారికి మరింత సేవ చేస్తానన్నారు. మహిళలకు ఇళ్ల పట్టాలు, డ్వాక్రా రుణమాఫీ, ఆటోడ్రైవర్లకు వాహన మిత్ర, రైతులకు పథకాలు, విద్యార్థులకు అమ్మ ఒడి, వసతి దీవెన, విద్యాదీవెన వంటి పథకాలు అందించామని గుర్తు చేశారు. ప్రతిపక్ష నాయకులు తమ స్వార్థం కోసం దేనికైనా వెనుకాడరని విమర్శించారు. కల్లబొల్లి, మాయమాటలు చెప్పి ప్రజలను మభ్యపెట్టాలని చూస్తున్నారని వారి మాటలు నమ్మవద్దని కోరారు. జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ, నాయకులు ఉన్నారు.

‘ఆశ్రం’కు ఐఎస్ఓ గుర్తింపు

ఏలూరు రూరల్: ఏలూరులోని అల్లూరి సీతారామ రాజు అకాడమీ ఆఫ్ మెడికల్ సైన్స్ (ఆశ్రం)కు ఇంటర్నేషనల్ ఆర్గనైజేషన్ ఫర్ స్టాండర్డైజేషన్ (ఐఎస్ఓ) గుర్తింపు దక్కినట్టు ఆశ్రం డైరెక్టర్ జి.రతీదేవి ఓ ప్రకటనలో తెలిపారు. ఆశ్రంలో అందుబాటులోకి తెచ్చిన ప్రపంచస్థాయి సౌకర్యాలు, వైద్య సేవలు, పరిశుభ్రత, విద్యా ప్రమాణాలు, శక్తి, పర్యావరణ అనుకూల వ్యవస్థకు ఐఎస్ఓ ఐదు సర్టిఫికెట్లు అందించిందన్నారు. రానున్న రోజుల్లో సేవలు, ప్రమాణాలు, నిర్వహణలో మరింత ఉన్నత శిఖరాలకు చేరుకుంటామని ఆశాభావం వ్యక్తం చేశారు. ఆశ్రం అత్యాధునిక వైద్యసేవలు, విద్యా ప్రమాణాలతో దేశంలోనే ప్రత్యేక గుర్తింపు పొందుతుందని ఆశ్రం సీఈఓ డాక్టర్ కె.హనుమంతురావు, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ శాంతయ్య, సీఓఓ ఎం.రాజరాజన్ ఆశాభావం వ్యక్తం చేశారు.

ఆక్సి‘జన హితం’

- నూజివీడు ఏరియా ఆస్పత్రిలో ఆక్సిజన్ ప్లాంట్
- నిమిషానికి 1,000 లీటర్ల ఉత్పత్తి సామర్థ్యం
- 100 పడకలకు ప్రాణవాయువు సదుపాయం
- రూ.1.10 కోట్లతో ఏర్పాటుచేసిన రాష్ట్ర ప్రభుత్వం



నూజివీడు ఏరియా ఆస్పత్రిలో ఆక్సిజన్ ప్లాంట్

నూజివీడు: కోవిడ్ రెండో దశ సమయంలో ప్రజల జీవితాలు అతలాకుతలం అయ్యాయి. కోవిడ్ డెల్టా వేరియంట్ పంజా విసరడంతో లక్షలాది మంది ఒకేసారి ఆస్పత్రుల పాలవ్వడంతో ఆక్సిజన్ కొరత ఏర్పడింది. ఆ సమయంలో రోగులకు సరిపడా ఆక్సిజన్ లేక చాలా ఇబ్బంది పడ్డారు. సకాలంలో ఆక్సిజన్ అందక ప్రాణాలు కోల్పోయిన వారు కూడా ఉన్నారు. ఇలాంటి పరిస్థితికి చెక్ చెప్పాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఏరియా ఆస్పత్రుల్లో ఆక్సిజన్ ప్లాంట్‌ల నిర్మాణానికి చర్యలు చేపట్టింది. దీనిలో భాగంగా నూజివీడు ఏరియా ఆస్పత్రిలో రూ.1.10 కోట్ల వ్యయంతో ఆక్సిజన్ ప్లాంట్‌ను నిర్మించి, ఏడాది క్రితమే అందుబాటులోకి తీసుకువచ్చింది. నేరుగా గాలి నుంచి ఆక్సిజన్‌ను తయారు చేసి దానిని పైపుల ద్వారా ఆస్పత్రిలోని వార్డుల్లో ఉన్న పడకలకు అనుసంధానం చేయడంతో పాటు అవసరమైనప్పుడు రోగులకు అందిస్తున్నారు. ప్రజారోగ్యానికి పెద్దపీట వేస్తూ ప్రభుత్వం ఆక్సిజన్ ప్లాంట్‌ను నిర్మించడంపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

100 పడకలకు అందుబాటులో..

ప్లాంట్‌లో నిమిషానికి వెయ్యి లీటర్ల ఆక్సిజన్ ఉత్పత్తి చేస్తారు. దీంతో 100 పడకలకు ఒకేసారి ఆక్సిజన్‌ను అందించవచ్చు. ఇప్పటివరకు సిలిండర్ల ద్వారా బయటి నుంచి కొనుక్కొని వచ్చి ఆస్పత్రిలోని రోగులకు ఆక్సిజన్‌ను అందించేవారు. సిలిండర్లు ఖాళీ అయిన తర్వాత మరలా రీఫిల్ చేయించేవారు. కరోనా రెండో వేవ్ సమయంలో ఆక్సిజన్‌కు భారీ డిమాండ్ ఏర్పడటంతో సిలిండర్లు అందుబాటులో లేక, ఉన్నా ఆక్సిజన్ కొరతతో తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యాయి. ఆక్సిజన్ కోసం మూడు, నాలుగు రోజులు సైతం వేచి ఉండాల్సి వచ్చింది. ఇటువంటి సమస్యలన్నింటికీ పరిష్కారం చూపుతూ ప్రభుత్వం ఆక్సిజన్ ప్లాంటును అందుబాటులోకి తీసుకువచ్చింది. దీంతో సాధారణ వైద్యసేవలతో పాటు అత్యవసర చికిత్సల సమయంలో కూడా ఆక్సిజన్ కొరత ఉండటం లేదు. ఏరియా ఆస్పత్రిలో ప్రస్తుతం మరో 200 బెడ్లు ఏర్పాటు చేసుకునేలా నూతన భవనాన్ని నిర్మించిన నేపథ్యంలో వాటికి కూడా ఈ ప్లాంట్ ద్వారా ఆక్సిజన్‌ను సదుపాయాన్ని ఏర్పాటు చేసుకోవచ్చు. ఈ ప్లాంట్ ద్వారా ఆస్పత్రిలో ఎప్పుడు కావాలంటే అప్పుడు ఆక్సిజన్‌ను పూర్తిస్థాయిలో ఉత్పత్తి చేసుకుంటూ రోగులకు అందించవచ్చు.

నిర్వాసితులందరికీ న్యాయం

ఎమ్మెల్యే అభ్యర్థి రాజ్యలక్ష్మి



వింజరంలో ఎన్నికల ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే బాలరాజు, ఎమ్మెల్యే అభ్యర్థి రాజ్యలక్ష్మి

కుక్కునూరు: పోలవరం ప్రాజెక్ట్ కోసం త్యాగాలు చేసిన నిర్వాసితులందరికీ పరిహారం అందించి న్యాయం చేస్తామని పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు, వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి తెల్లం రాజ్యలక్ష్మి అన్నారు. శనివారం వారు మండలంలోని బర్లమడుగు, కొండపల్లి, వింజరం, గుండంబోరు, ఎర్రబోరు, చిరవెల్లి, మాధవరం, కౌండిన్యముక్తి, ముత్యాలంపాడు, దామరచర్ల గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బాలరాజు మాట్లాడుతూ సీఎం జగన్ రాష్ట్రంలో అవినీతికి తావులేకుండా సంక్షేమ పథకాలు అందించారని, దీంతో ప్రజలంతా తమకు బ్రహ్మరథం పడుతున్నారన్నారు. వలంటీర్ వ్యవస్థ ద్వారా ఇంటి వద్దకే పథకాలు అందిస్తున్నారన్నారు. గ్రామాల్లో సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వెల్‌నెస్ కేంద్రాలు వంటివి నిర్మించారన్నారు. రాష్ట్రంలో 17 వైద్య కళాశాలల నిర్మాణం, నాడు–నేడులో ప్రభుత్వ బడుల అభివృద్ధి వంటివి చేశారన్నారు. వీటిని చూసి ఓర్వలేని చంద్రబాబు నీచ రాజకీయాలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఎమ్మెల్యే అభ్యర్థి రాజ్యలక్ష్మి మాట్లాడుతూ నిత్యం పోలవరం నియోజవర్గ అభివృద్ధి కోసం తపించే వ్యక్తి బాలరాజు అని అన్నారు. వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా తనను అఖండ మెజార్టీతో గెలిపించి సీఎం జగన్‌కు బహుమతిగా ఇద్దామని పిలుపునిచ్చారు. జెడ్పీటీసీ కుంజా నాగేశ్వరరావు, ఎంపీపీ చేబ్రోలు గీతావాణి, వైస్ ఎంపీపీ తాండ్ర రాజేష్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ గంగుల రమణారెడ్డి, ఎంపీటీసీ కుండా సూరి, సర్పంచ్‌లు రావు మీనా, జగిడి బాలరాజు, మండల అధ్యక్షుడు కుచ్చర్లపాటి నరసింహరాజు, నాయకులు ఉన్నారు.

సంక్షేమం, అభివృద్ధే విజయానికి రక్ష

ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు



ఎంఎంపురంలో వృద్ధురాలిని పలకరిస్తున్న ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు

భీమడోలు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలే విజయానికి శ్రీరామరక్షగా నిలుస్తాయని, ప్రతిఒక్కరూ వైఎస్సార్‌సీపీ గెలుపునకు ఓట్లు వేసి ఆశీర్వదించాలని ఉంగుటూరు ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు కోరారు. పూళ్ల పంచాయతీ శివారు ఎంఎం పురం గ్రామంలో శనివారం సాయంత్రం మేము సిద్ధం.. మా బూత్ సిద్ధం–మా ఊరికి వాసన్న కార్యక్రమంలో భాగంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ఆయన ఓట్లు అభ్యర్థించారు. వృద్ధులు, అక్కాచెల్లెమ్మల సాదక బాధకాలు తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఓట్ల కోసం వచ్చే పగటి వేషగాళ్లను నమ్మవద్దన్నారు. సీఎం జగన్ ప్రజా సంకల్ప యాత్రలో ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేసి ప్రజల హృదయాల్లో సుస్థిర స్థానం పొందారన్నారు. మరలా వైఎస్సార్‌సీపీ గెలిస్తే సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలు ప్రతి గడపకూ చేరతాయన్నారు. కూటమి పార్టీల మాటలు నమ్మి మోసపోవద్దని, అధికారం కోసమే పొత్తు పెట్టుకున్నాయని, ప్రజలకు సేవ చేయడానికి కాదన్నారు. ఎన్నికల్లో వారికి తగిన గుణపాఠం చెప్పాలన్నారు. వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల గెలుపునకు సంపూర్ణ మద్దతు ఇవ్వాలని కోరారు.

సంక్షేమంతోనే పేదల అభివృద్ధి

ఎమ్మెల్యే ప్రతాప్ అప్పారావు



చిత్తపూరులో ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు

చాట్రాయి: సీఎం జగన్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో పేదలు అభివృద్ధి చెందుతున్నారని నూజివీడు ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. శనివారం మండలంలోని చిత్తపూరు గ్రామంలో ఆయన ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా సీఎం జగన్ సంక్షేమం అందించారని, గత టీడీపీ ప్రభుత్వం పేదలను పట్టించుకోలేదని విమర్శించారు. తమ ప్రభుత్వంలో గ్రామాల్లో సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వెల్‌నెస్ కేంద్రాలు నిర్మించారని, దీంతో ప్రజలకు కావాల్సిన సౌకర్యాలు త్వరితగతిన స్థానికంగా అందుతున్నారన్నారు. సీఎం జగన్ పాలనలో నాడు–నేడులో ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్దారన్నారు. రాష్ట్రంలో జగన్ గాలి వీస్తుందని, కూటమి ఓడిపోవడం ఖాయమని అన్నారు. గతంలో చంద్రబాబు పాలనకు ప్రస్తుత జగన్ పాలనకు మధ్య తేడాను ప్రజలంతా గమనించాలని కోరారు. చిత్తపూరు గ్రామంలో సుమారు రూ.30 కోట్లను సంక్షేమ పథకాల రూపంలో ప్రజల ఖాతాలకు జమ చేశామన్నారు. మళ్లీ సంక్షేమం, అభివృద్ధి కావాలంటే ఎమ్మెల్యే అభ్యర్థిగా తనను, ఏలూరు ఎంపీ అభ్యర్థిగా కారుమూరి సునీల్‌కుమార్ యాదవ్‌ని ఫ్యాన్ గుర్తుపై ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. అనంతరం మండల జనసేన అధ్యక్షుడు ఆరెల్లి కృష్ణ, టీడీపీ సీనియర్ నాయకులు బత్తుల రామారావు, కంకట వెంకటేష్, ఆరెల్లి రాజాకు చెందిన కుటుంబాల వారికి జెండా కప్పి వైఎస్సార్‌సీపీలోకి ఆహ్వానించారు. ఏపీ కో–ఆపరేటివ్ యూనియన్ రాష్ట్ర చైర్మన్ దేశిరెడ్డి రాఘవరెడ్డి, సర్పంచ్ తిరువీధి రమేష్, ఎంపీటీసీ సభ్యురాలు యల్లంకి సుజాత, నాయకులు ఉన్నారు.

పక్కాగా అభ్యర్థుల వ్యయాల నమోదు

ఎన్నికల పరిశీలకుల వెల్లడి



అభ్యర్థుల ఎన్నికల వ్యయాలపై అధికారులకు సూచనలిస్తున్న వ్యయ పరిశీలకులు

ఏలూరు(మెట్రో): ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు ఎన్నికల ఖర్చును నిబంధనల మేరకు నమోదు చేయాలని జిల్లా ఎన్నికల వ్యయ పరిశీలకులు షెరింగ్ జొర్డెన్ భూటియా, మేశ్రమ్ గౌరవ్ మధుకర్, పి.కీర్తి నారాయణ్ అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లో అభ్యర్థుల ఎన్నికల వ్యయ నమోదుపై అధికారులతో సమీక్షించారు. జిల్లాలో పోటీ చేసే అభ్యర్థుల ఎన్నికల వ్యయం నమోదు విధానంపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. అభ్యర్థులు గరిష్ట పరిమితికి మించి ఖర్చు చేస్తే అనర్హులవుతారని, వ్యయాలను రిజిస్టర్లలో నమోదు చేసి, రోజువారీ నివేదికను సంబంధిత రిటర్నింగ్ అధికారులకు అదే రోజు అందించాలన్నారు. జిల్లాలో మద్యం అక్రమ రవాణాను నియంత్రించాలని, చెక్‌పోస్టుల వద్ద తనిఖీలు ముమ్మరం చేయాలన్నారు. అభ్యర్థుల ర్యాలీలు, బహిరంగ సభలు, ఫ్లెక్సీ, బ్యానర్లు, వినియోగించు వాహనాలు తదితర అంశాలపై అభ్యర్థులు తెలియజేసిన వ్యయాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి నిర్ధారించుకోవాలన్నారు. వ్యత్యాసాలుంటే నివేదికలో పొందుపర్చాలన్నారు.

8 చెక్‌పోస్టులు : జిల్లా అదనపు ఎస్పీ స్వరూపరాణి మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా 8 అంతర్రాష్ట్ర, అంతర్ జిల్లాల చెక్‌పోస్టులలో తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. సోషల్ మీడియాలో ప్రచారాలపై ప్రత్యేక నిఘా ఉంచామన్నారు. చెక్‌పోస్టులు తదితరాల దగ్గర సీజ్ చేసిన నగదు, బంగారం, మద్యం వంటి వాటి వివరాలను జెడ్పీ సీఈఓ కె.సుబ్బారావును అడిగి పరిశీలకులు తెలుసుకున్నారు. మద్యం, సారా తయారీ నియంత్రణలపై ఎస్ఈబీ ఏఎస్పీ నక్కా సూర్యచంద్రరావు వివరించారు. డీపీఓ శ్రీనివాస్ విశ్వనాథ్ మాట్లాడుతూ ఓటర్ల అవగాహన కార్యక్రమాల వివరాలు తెలియజేశారు. అనంతరం ఓటర్ల అవగాహనపై జిల్లా యంత్రాంగం ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను పరిశీలకులు పరిశీలించారు. ఉప రవాణా కమిషనర్ ఎస్.శాంతికుమారి, ఎక్సైజ్ శాఖ సూపరింటెండెంట్ ఆర్ఎస్ కుమరేశ్వరన్, ఇన్‌కం ట్యాక్స్ అధికారి ఎన్.కుమార్ మంగళ, అసిస్టెంట్ ట్రెజరీ అధికారి పి.పార్వతి పాల్గొన్నారు.

క్లుప్తంగా

నిర్లక్ష్యమా.. పట్టించుకోరా!

దెందులూరు మండలంలో కోడ్ అమలు తీరుపై విమర్శలు



గంగన్నగూడెం కో-ఆపరేటివ్ బ్యాంకు ఎదుట తెలుగుదేశం పార్టీ చిహ్నంకు ముసుగు వేయని దృశ్యం

దెందులూరు: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మండలంలో కోడ్ అమలులో అధికారుల నిర్లక్ష్యంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గంగన్నగూడెంలో కో-ఆపరేటివ్ బ్యాంకు ఎదుట గోడకు పసుపురంగు, టీడీపీ చిహ్నం, ఎన్టీ రామారావు పేరుకు ముసుగు వేయలేదు. పర్యవేక్షణ చేయాల్సిన గ్రామ, మండల అధికారులు పట్టించుకోవడం లేదు. ఇతర పార్టీల విషయంలో కచ్చితంగా కోడ్ అమలు చేస్తున్న ఉద్యోగులు టీడీపీ విషయంలో కోడ్ అమలు చేయకపోవడాన్ని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందిస్తారో లేదో.

ధాన్యం కొనుగోలు వేగవంతం చేయండి

ఏలూరు (మెట్రో): ఏలూరు జిల్లాలో శనివారం నాటికి 3,117 మంది రైతుల నుంచి రూ.80.76 కోట్ల విలువైన 37,067 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు జేసీ బి.లావణ్యవేణి చెప్పారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియపై సంబంధిత అధికారులతో జేసీ టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో 7,517 మంది రైతులకు చెందిన 67,273 మెట్రిక్ టన్నుల ధాన్యం విక్రయం కోసం రైతులు నమోదు చేసుకున్నారన్నారు. మద్దతు ధర, తేమశాతంపై రైతులకు అవగాహన కల్పించి ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని జేసీ అధికారులను ఆదేశించారు.

5204కు ప్రత్యామ్నాయం.. 1271

- ఎంటీయూ 1271 వరి వంగడాన్ని క్షేత్ర స్థాయిలో పండించేలా రైతులను ప్రోత్సహించండి
- ఏరువాక కేంద్రాలు, కేవీకేలకు గుంటూరు లాంఫాం పరిశోధనా సంచాలకులు ఎల్.ప్రశాంతి ఆదేశం
- మార్టేరులో గోదావరి మండల పరిశోధన, విస్తరణ సమీక్ష సమావేశం



మార్టేరు సమావేశంలో మాట్లాడుతున్న ఎల్.ప్రశాంతి

పెనుమంట్ర: బీపీటీ 5204 వరి రకానికి ప్రత్యామ్నాయంగా రూపొందించిన ఎంటీయూ 1271 వరి వంగడాన్ని రైతుల పొలాల్లో క్షేత్ర స్థాయిలో పరిశీలన చేయాలని గోదావరి మండలాల్లోని వివిధ ఏరువాక కేంద్రాలను, కేవీకేలను ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం గుంటూరు లాంఫాం పరిశోధనా సంచాలకులు డాక్టర్ ఎల్.ప్రశాంతి అధికారులను ఆదేశించారు. శనివారం రెండోరోజు మార్టేరు వ్యవసాయ పరిశోధనా కేంద్రంలో జరిగిన గోదావరి మండల పరిశోధన, విస్తరణ సమీక్షా సమావేశంలో ఆమె మాట్లాడారు. పరిశోధనా స్థాన సహ సంచాలకులు డాక్టర్ ధన్యంరాజు శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఆమె మాట్లాడుతూ వరి రకాల పరిశీలనే కాకుండా గడ్డి కుళ్లడానికి వినియోగించే డీ కంపోజర్లపై కూడా క్షేత్ర పరిశీలన జరపాలన్నారు. తక్కువ ఖర్చులో రైతులకు అనువుగా ఉండే యంత్రాలను రూపొందించుకోవాల్సిన ఆవశ్యకత మార్టేరు శాస్త్రవేత్తలపై ఉందన్నారు. ఆ దిశగా కార్యాచరణ రూపొందించాలన్నారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న వరి వంగడాలు వినియోగదారులు తినడానికి అనువుగా ఉన్నాయో లేవో తెలుసుకోవాలని, తడిసిన ధాన్యంతో విలువ ఆధారిత ఉత్తత్పుల తయారీ మొదలైన అంశాలను కూడా పరిగణనలోకి తీసుకుని కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు. విస్తరణ సంచాలకులు డాక్టర్ కేఎస్ఎస్ నాయక్ మాట్లాడుతూ చిరు సంచి రకాలను రైతులు పొలాల్లో పరీక్షించేటప్పుడు కేవలం దిగుబడే కాకుండా మిల్లర్ల అభిప్రాయం, అన్నంరుచి, ఒదుగు అయ్యే గుణం వంటి లక్షణాలను కూడా పరిగణనలోకి తీసుకుని పరీక్షించాలన్నారు. కేవీకేలు ఇచ్చే శిక్షణా కార్యక్రమాలు రైతులు పొలాలను సందర్శించే కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాలన్నారు. అందుబాటులో ఉన్న సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుని రైతులకు చేరువ చేయడానికి వాట్సాప్, ఫేస్బుక్ వంటి సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవాలని కోరారు. అనంతరం వివిధ పంటలపై రైతులు అడిగిన ప్రశ్నలకు ప్రధాన శాస్త్రవేత్తలు సమాధానాలు ఇచ్చి వారి సందేహాలను నివృత్తి చేశారు. అనంతరం వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు, అభ్యుదయ రైతులు కలిసి రౌండ్ టేబుల్ చర్చల ద్వారా 2024-25 సంవత్సరానికి గాను పరిశోధన, విస్తరణ ప్రణాళికను రూపొందించారు. ఈప్రణాళికను వచ్చే నెలలో జరిగే రాష్ట్ర స్థాయి సాంకేతిక సమావేశాలలో ఆమోదం పొందాల్సి ఉంది. ఈ కార్యక్రమంలో గోదావరి మండల సహ పరిశోధనా సంచాలకులు డాక్టర్ బి.శ్రీనివాస్, జిల్లా వ్యవసాయశాఖ అధికారి జెడ్.వెంకటేశ్వరరావు, శ్రీహరి, జ్యోతిర్మయి, పరిశోధనా స్థానం శాస్త్రవేత్తలు, అభ్యుదయ రైతులు పాల్గొన్నారు.

● డ్రమ్ముల్లో జలకాలు



ఎండలు తీవ్రంగా ఉండటంతో చిన్నాపెద్దా ఉష్ణతాపంతో అల్లాడిపోతున్నారు. వేడి గాలులు వీస్తుండటంతో బయటకు రావడానికే భయపడిపోతున్నారు. ఈ నేపథ్యంలో ఏలూరు శివారులో గృహ నిర్మాణానికి ఉపయోగించేందుకు నీళ్ల నింపిన డ్రమ్ముల్లోకి దిగి చిన్నారులు ఇలా జలకాలు ఆడుతూ కనిపించారు. ఈత సరదా తీరడంతో పాటు శరీరంలో వేడి తగ్గడంతో సేదతీరారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్/ఏలూరు

పెదపాడు యువతికి ఎంబీఏలో గోల్డ్‌మెడల్



తల్లిదండ్రులతో కాకరాల ఫణిసీత

పెదపాడు: పెదపాడుకు చెందిన ఫణి సీత ఒడిశా రాష్ట్రం భువనేశ్వర్‌లోని సెయింట్ గ్జేవియర్ యూనివర్సిటీలో ఎంబీఏ చదివి గోల్డ్ మెడల్ సాధించింది. శనివారం యూనివర్సిటీ అధికారులు ఆమెకు గోల్డ్‌మెడల్ అందించారు. రైతు కుటుంబానికి చెందిన కాకరాల సత్యనారాయణ (బాబి), రామప్రసన్న పెద్ద కుమార్తె కాకరాల ఫణి సీత ఏలూరులోని సీఆర్ఆర్ పబ్లిక్ స్కూల్లో 10వ తరగతి చదివి 94 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించింది. గుంటూరులోని ఓ ప్రైవేటు కాలేజీలో ఇంటర్మీడియట్ చదివి 94 శాతం మార్కులు సాధించింది. గీతం యూనివర్సిటీలో గ్రాడ్యుయేషన్‌లో ఈఈఈ బ్రాంచిలో 97 శాతం మార్కులతో గోల్డ్ మెడల్ పొందింది. అనంతరం సెయింట్ గ్జేవియర్ యూనివర్సిటీలో ఎంబీఏ చదివి గోల్డ్ మెడల్ సాధించింది. వేదాంతు సంస్థలో ఒకటైన మైన్స్ విభాగంలో మేనేజ్‌మెంట్ ట్రైనీగా ఏడాదికి రూ.25 లక్షల ప్యాకేజీతో ఉద్యోగం సాధించింది. యూనివర్సిటీలో ప్లేస్‌మెంట్ కమిటీ ఎగ్జిక్యూటివ్ మెంబరుగా ఆమె వ్యవహరిస్తూ 2023-24లో ప్రముఖ కంపెనీల్లో వంద శాతం విద్యార్థులు ఉద్యోగాలు పొందేలా సహకారం అందించింది. ఈ సందర్భంగా పలువురు ఫణి సీతను అభినందించారు.

సమస్యాత్మక కేంద్రాల్లో తనిఖీలు చేస్తుండాలి



పోలీసు అధికారులతో సమీక్షిస్తున్న ఎస్పీ మేరీ ప్రశాంతి

కొయ్యలగూడెం: ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ప్రతి ఒక్కరూ ఎన్నికల నియమ నిబంధనలను తు.చ.తప్పకుండా పాటించాలని ఎస్పీ మేరీ ప్రశాంతి అన్నారు. కొయ్యలగూడెం పోలీస్‌స్టేషన్‌లో శనివారం పోలవరం సబ్ డివిజన్ పరిధిలోని పోలీస్ అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఎస్పీ మాట్లాడారు. ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థులు 18 ఏళ్ల లోపు చిన్నారులను ప్రచారాల్లో ఉపయోగించరాదన్నారు. అధికారులు గ్రామాలను సందర్శించాలని, సమస్యలను ఉంటే వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. తామున్నామంటూ ఓటర్లకు భరోసా కల్పిస్తూ ఓటు హక్కును ప్రతి ఒక్కరూ వినియోగించుకునేలా కృషి చేయాలన్నారు. సారా, మద్యం, గంజాయి అక్రమ రవాణా జరగకుండా ప్రత్యేక దృష్టి సారించి చర్యలు చేపట్టాలన్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో తనిఖీలు నిర్వహించి పోలింగ్ సజావుగా జరిగేలా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. ప్రశాంతమైన వాతావరణంలో పోలింగ్ జరిగేలా ప్రతి అధికారి చిత్తశుద్ధితో పని చేయాలన్నారు. పోలవరం డీఎస్పీ సురేష్‌కుమార్ రెడ్డి, ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ మల్లేశ్వరరావు, కుక్కునూరు ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు, పోలవరం ఇన్‌స్పెక్టర్ మధుబాబు, కొయ్యలగూడెం ఎస్సై విష్ణువర్ధన్ పాల్గొన్నారు.

జగన్‌తోనే ముస్లిం, మైనార్టీ సంక్షేమం సాధ్యం

- ఏలూరు ఎమ్మెల్యే ఆళ్ల నాని
- వైఎస్సార్ సీపీలో చేరిన టీడీపీ ముస్లిం యువకులు



ఎమ్మెల్యే నాని సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరిన టీడీపీ ముస్లిం యువకులు



ఏలూరులో ఎమ్మెల్యే నానితో మాట్లాడుతున్న ముస్లిం మత పెద్దలు

ఏలూరు టౌన్: రాష్ట్రంలో ముస్లిం మైనార్టీల సంక్షేమం, అభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి విశేష కృషి చేస్తున్నారని, రాజకీయంగానూ ప్రాధాన్యత ఇస్తున్నారని ఏలూరు ఎమ్మెల్యే, పార్టీ జిల్లా అధ్యక్షులు ఆళ్ల నాని అన్నారు. ఏలూరు క్యాంపు కార్యాలయంలో శనివారం నగరంలోని 46వ డివిజన్ కార్పొరేటర్ అయేషా సుల్తానా, వైఎస్సార్‌సీపీ ముస్లిం, మైనార్టీ సెల్ నగర అధ్యక్షులు రియాజ్ అలీఖాన్ ఆధ్వర్యంలో పెన్షన్ లైన్ మసీదు కమిటీ అధ్యక్షులు జిలాని బేగ్, కార్యదర్శి అబూబకర్, ఉపాధ్యక్షులు నవాబ్ బీ, పెద్దలు అక్బర్, మగ్బుల్ తదితరులు ఎమ్మెల్యే నానిని కలిశారు. ఏలూరు నగరంలో ముస్లిం షాదీఖానా స్థల కేటాయింపు, పునఃనిర్మాణం, మసీదుల అభివృద్ధి, ఉర్దూ స్కూల్ అభివృద్ధి, ముస్లిం ప్రాంతాల్లో సీసీ రోడ్లు, సీసీ డ్రెయిన్ల నిర్మాణాలు చేపట్టి ఎమ్మెల్యే నాని అండగా నిలిచారని, వారంతా అభినందించారు. పెన్షన్‌లైన్ ముస్లిం యువత ఆధ్వర్యంలో ఆ ప్రాంతంలోని టీడీపీకి చెందిన పలువురు కార్యకర్తలు ఎమ్మెల్యే ఆళ్ల నాని సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. వారందరికీ పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా నాని మాట్లాడుతూ రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ముస్లిం మైనార్టీలంతా అండగా నిలవాలని కోరారు. బీజేపీ, టీడీపీ, జనసేన కూటమి చేస్తున్న కుట్రలను, కుటిల రాజకీయాలను గుర్తించి వారికి సరైన గుణపాఠం చెప్పాలని కోరారు. ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ ఏర్పాటుకు సహకరించాలని కోరారు. కో-ఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబు, ఇడా చైర్మన్ బొద్దాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ గుడిదేశి శ్రీనివాస్, బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి కిలాడి దుర్గారావు తదితరులున్నారు.

విద్యుదాఘాతానికి వ్యక్తి మృతి

ఆగిరిపల్లి: ఇంటర్‌నెట్ కనెక్షన్ ఇచ్చేందుకు స్తంభం ఎక్కగా విద్యుత్ షాక్‌కు గురై ఓ వ్యక్తి స్తంభం పైనుంచి పడి మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి. కల్లుటూరుకు చెందిన కాటూరు రాజు (35) గ్రామంలో ఇంటర్నెట్ సర్వీస్ చేసే వ్యక్తి వద్ద ఐదేళ్లుగా పనిచేస్తున్నాడు. శనివారం సాయంత్రం సగ్గూరులో నెట్ కనెక్షన్ ఇవ్వడానికి విద్యుత్ స్తంభం ఎక్కాడు. ఆ సమయంలో పక్కనే విద్యుత్ వైరు తగలడంతో షాక్‌కు గురై స్తంభం పైనుంచి కింద పడిపోయాడు. స్థానికులు వెంటనే అతనిని చికిత్స నిమిత్తం నూజివీడు అమెరికన్ ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పోక్సో కేసు నమోదు

జంగారెడ్డిగూడెం: పట్టణానికి చెందిన ఓ బాలికతో అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్సై జి.జ్యోతిబాస్ మంగళవారం చెప్పారు. ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో పదేళ్ల బాలిక సోదరితో కలిసి చదువుతోంది. ఈ నెల 19న అంజత్ అనే 45 సంవత్సరాల వ్యక్తి బాలిక తల్లి ఇంట్లో లేని సమయంలో బాలిక ఇంటికి వెళ్లి అసభ్యకరంగా ప్రవర్తించాడు. దీంతో బాలిక కేకలు వేయగా, అంజత్ పారిపోయాడు. ఈ విషయాన్ని స్థానిక మహిళ బాలిక తల్లికి తెలపడంతో ఇంటికి వచ్చిన బాలిక తల్లి జరిగిన విషయాన్ని బాలిక నుంచి అడిగి తెలుసుకుని ఫిర్యాదు చేసిందన్నారు. ఈ ఘటనకు సంబంధించి వ్యక్తిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

కట్నం వేధింపులపై కేసు

ఆకివీడు: కట్నం కోసం వేధిస్తున్నారంటూ బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై బి.నాగబాబు చెప్పారు. మండలంలోని చినకాపవరం గ్రామానికి చెందిన కోపల్లె వెంకటలక్ష్మిని అదనపు కట్నం కోసం భర్త, అత్తింటివారు వేధిస్తున్నారు. బాధితురాలు శనివారం ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేసింది.

వైఎస్సార్ సీపీలో చేరిన టీడీపీ నేతలు



గోపాలపురంలో టీడీపీ నుంచి ఎమ్మెల్యే డీఎన్నార్ సమక్షంలో పార్టీలో చేరిన ముదిరాజ్ కుటుంబ సభ్యులు

కైకలూరు: కలిదిండి మండలం గోపాలపురం గ్రామం నుంచి 100 మంది ముదిరాజ్ సామాజిక వర్గానికి చెందిన టీడీపీ కార్యకర్తలు శనివారం వైఎస్సార్ సీపీలో చేరారు. ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) వీరికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థుల విజయానికి కృషి చేస్తామని పార్టీలో చేరిన కార్యకర్తలు చెప్పారు. కార్యక్రమంలో వివిధ గ్రామాలకు చెందిన పార్టీ నాయకులు కోమటి విష్ణువర్ధన్, పాము రవికుమార్, బోనం శేషగిరిరావు, పి.రామకృష్ణ, పెరుమాళ్ల సత్యనారాయణ, అనపర్తి కాసులు, గోదావరి సత్యనారాయణ, పరసా శ్రీనివాసరావు, గూడవల్లి అర్జునరావు, పెరుమాళ్ల మల్లయ్యస్వామి, కరేటి భాస్కరరావు, కోలా రాజా, తాతారావు తదితరులు పాల్గొన్నారు.

తనిఖీల్లో నగదు స్వాధీనం



తనిఖీల్లో నగదు స్వాధీనం చేసుకున్న సిబ్బంది



గణపవరంలో తనిఖీ చేస్తున్న ఎఫ్ఎస్‌టీ సిబ్బంది

కామవరపుకోట: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో వాహనాల తనిఖీల్లో భాగంగా శనివారం వేర్వేరు వ్యక్తుల నుంచి రూ.2.53 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎన్నికల చెక్‌పోస్ట్ అధికారి మహమ్మద్ మొహిద్దీన్ చెప్పారు. తాడిచర్ల గ్రామానికి చెందిన ఒక వ్యక్తి నుంచి రూ.1.13 లక్షల నగదు, పుట్లగట్లగూడెం గ్రామానికి చెందిన ఒక వ్యక్తి నుంచి రూ.1.40 లక్షల నగదు స్వాధీనం చేసుకుని ఫ్లయింగ్ స్క్వాడ్ ఏఎస్సై స్వామికి అందజేసినట్లు మొహిద్దీన్ తెలిపారు. ఈ నగదును ఎన్నికల ట్రెజరీలో జమ చేస్తారని, తగిన ఆధారాలు చూపించినట్లయితే నగదును తిరిగి ఇస్తారని తెలిపారు. హెచ్‌సీ కె.రమేష్, కె.రామకృష్ణ, జి.సూర్యరావు, షేక్ నాగూర్, ఎం.నాగార్జున, సుధీర్ పాల్గొన్నారు.

గణపవరం మండలంలో..

గణపవరం: మండలంలో వేర్వేరు చోట్ల అధికారుల తనిఖీల్లో రూ.2.35 లక్షల నగదు పట్టుబడింది. వాకపల్లి అడ్డరోడ్డు వద్ద శనివారం ఎఫ్ఎస్‌టీ బృందం చేసిన తనిఖీల్లో ఓ వ్యక్తి నుంచి రూ.90 వేల నగదును స్వాధీనం చేసుకున్నారు. అలాగే శుక్రవారం రాత్రి గణపవరంలో నిర్వహించిన తనిఖీల్లో మరో వ్యక్తి నుంచి రూ.1.45 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు. ఎన్నికల నిబంధనల మేరకు రూ.50 వేల వరకూ మాత్రమే నగదును కలిగి ఉండాలని ఆపైన ఉంటే తగిన ఆధారాలు చూపాలని తనిఖీ బృందం సభ్యులు తెలిపారు.

శ్రీవారి సేవలో ఉన్నతాధికారులు



శ్రీవారి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న నితిన్ కురైన్, రోహిత్ నగర్

ద్వారకాతిరుమల: చినవెంకన్న దివ్యక్షేత్రాన్ని పలువురు ఉన్నతాధికారులు శనివారం దర్శించుకున్నారు. తూర్పుగోదావరి జిల్లా ఎన్నికల పరిశీలకులు నితిన్ కురైన్ (ఐఆర్ఎస్), రోహిత్ నగర్ (ఐఆర్ఎస్) క్షేత్రాన్ని సందర్శించారు. ఆలయానికి విచ్చేసిన వీరికి ముందుగా దేవస్థానం అధికారులు మర్యాదపూర్వకంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వారు స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ముఖ మండపంలో అర్చకులు, పండితులు వారికి శ్రీవారి శేష వస్త్రాలను కప్పి వేద ఆశీర్వచనాన్ని పలికారు. ఆ తరువాత స్వామివారి జ్ఞాపికలను, ప్రసాదాలను అందజేశారు.

శ్రీవారి సేవలో సీఆర్‌డీఏ ఏసీ సింహాచలం



శ్రీవారి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న సీఆర్‌డీఏ అడిషనల్ కమిషనర్ సింహాచలం

ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకాతిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి వారి ఆలయాన్ని సీఆర్‌డీఏ అడిషనల్ కమిషనర్ కట్టా సింహాచలం శనివారం సందర్శించారు. కుటుంబ సమేతంగా ఆలయానికి విచ్చేసిన ఆయన ముందుగా స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయనకు శ్రీవారి శేషవస్త్రాన్ని కప్పి, వేద ఆశీర్వచనాన్ని పలికి జ్ఞాపిక, ప్రసాదాలను అందజేశారు.

గమనిక

సాక్షి తెలుగు దిన పత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటన దారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.